# చరాచర ప్రపంచమంతయు బ్రహ్మస్వరూపమే!

**మనిషి పుట్టినప్పుడు అమృతపుత్రుడై జన్మించు**
**పిదప వాసనలతోడ పెరుగుచుండు**
**విషయవాంఛలతోడ విషతుల్యుడగునయా**
**సర్వశ్రుతుల ఊట సాయి మాట.**

విద్యార్థులారా!

జ్ఞానమునకు మించినది యీ జగత్తులో మరొకటిలేదు. ఎట్టి జ్ఞానము? భౌతిక జ్ఞానమా, నైతిక జ్ఞానమా, ఆధ్యాత్మిక జ్ఞానమా, ఏ జ్ఞానము? అన్నియు జ్ఞానములే! అయితే, సర్వజ్ఞాన సమ్మిళితమైన జ్ఞానము, బ్రహ్మజ్ఞానము. బ్రహ్మజ్ఞానమనగా ఏమిటి? సమస్త విశ్వస్వరూపము ఏకత్వముగా విశ్వసించటమే బ్రహ్మజ్ఞానము. చరాచర ప్రపంచమంతము బ్రహ్మస్వరూపమే! దీనినే బృహత్స్వరూపమనికూడా చెప్పవచ్చును. ఇదిలేని స్థానముగానీ తానుకాని నామముకానీ ఎక్కడా కనుపించదు. కనుక మనము చూచునది, వినునది, తలంచునది, అనుభవించునది, ఆనందించునది కేవలము బ్రహ్మముయొక్క తత్త్వమే!

## ప్రేమలేని మానవత్వము మృగస్వరూపమనే చెప్పవచ్చు

ఈ జగత్తునందు మానవాకారము ధరించి ప్రవేశించిన ప్రతి మానవునియందు కొన్ని విలువలుంటున్నవి. కానీ, అట్టి విలువలు మానవుడు గుర్తించుకొనలేక, దానిని సక్రమమైన మార్గములో పెట్టుకొనలేక, పెడమార్గము పట్టించి మానవత్వమును కేవలము వ్యర్థము గావించుకుంటున్నాడు. ఉప్పులేని పప్పు రుచిలేనట్టుగా ప్రేమలేని మానవత్వము మృగస్వరూపమనే చెప్పవచ్చు. కనుక మానవత్వమనగా మొట్టమొదటిది ప్రేమతత్త్వమే! అయితే ఈ ప్రేమను ఏవిధంగా, ఎక్కడ ఎప్పుడు ఎట్లా ప్రవేశపెట్టాలి అనే విధివిధానాన్ని చక్కగా గుర్తించి వర్తించాలి. ఉప్పులేక పప్పు మనం భుజించలేము. కానీ ఎంత పప్పో అంత

srisathyasaivachanamrutam

ఉప్పు కలిపితే అదికూడ మనం సహించలేము. ఒక్కగంటలో అరిగిపోయే పప్పుకే మనము యింత రుచిని ఆలోచిస్తున్నాము. ముప్పై సంవత్సరములు, ఏభై సంవత్సరములు, అరవై సంవత్సరములు, ఎనభై సంవత్సరములు జీవించబోయే మానవత్వమునకు కొంతవరకైనా రుచి ఉండనక్కరలేదా? ఈ రుచిలేక మానవుడు యింతకాలము ఏ విధంగా జీవించగలుగుతున్నాడు? ఇది ఒక మానవ జీవితమా? కాదు కాదు. క్షణ క్షణము మానవత్వములోనుండిన పవిత్రమైన ఈ విలువను మనముపయోగించుకుంటూ రావాలి. ఈ మానవతా విలువలు ఈనాడు విస్మరించటముచేత జగత్తును విశ్వసించి మానవత్వము కోల్పోయి కేవలం పశుత్వముగా అనుభవిస్తున్నాడు, జీవితాన్ని.

## ప్రేమలేక జీవితమే లేదు

ఆధ్యాత్మిక చింతనయందు మూడు పదములుంటున్నవి. 'అస్తి', 'భాతి', 'ప్రియము' అని. వీనినే సంస్కృతమునందు సత్, చిత్, ఆనందమని పేర్కొనడం జరిగింది. ఈ సత్, చిత్, ఆనందముల అంతరార్థము ఏమిటి? ఇది ఒక టంబ్లరు. ఈ టంబ్లరు ఇక్కడ ఉన్నది. ఉండినప్పుడే దీనికి ఒక 'టంబ్లరు' అని పేరు పెట్టుకుంటున్నాము. ఆ ఉన్నదే being అదియే సత్. ఇది మార్పు చెందనిది. ఉన్నది being. అయితే ఉన్నది అనే విషయము నీవు ఎట్లా గుర్తించగలుగుతున్నావు? దీనిని ప్రకాశింపచేసే ఒక వెలుగున్నది. ఇదే టంబ్లరు చీకటిలో ఉంటే ఉన్నది అని చెప్పలేము. ఇది వెలుగులో ఉండటంచేత టంబ్లరు ఉన్నది అని చెబుతున్నాం. ఆ వెలుగు ఏమిటి? ఆ వెలుగే ఒక జ్ఞానము. ఆ వెలుగే యీ టంబ్లరు ఇక్కడున్నది అనే సత్యమును నిరూపిస్తున్నది. ఈ వెలుగునే 'చిత్' అన్నారు. ఉన్నది అనే దానిని నిరూపించేది చిత్. చిత్, సత్ అవినాభావసంబంధము, అన్యోన్య ఆశ్రయము. ఇక్కడ టంబ్లరు ఉన్నది అని చెప్పినప్పుడు వెలుగుకూడా ఉన్నది. అనగా జ్ఞానము ఉన్నది. ఈ పదార్థముయొక్క స్వరూపము మనము గుర్తించుకోగలుగుతున్నాము. ఈ రెండు జరిగినప్పుడే మనకు తృప్తి ఉంటున్నాది. ఈ తృప్తియే ఆనందము. ఉన్నది-సత్, ఉండినట్టుగా నిరూపించేది చిత్. ఈ రెండింటి ఏకత్వములో కలిగే తృప్తే ఆనందము. కనుక సత్, చిత్, ఆనందము ఒక పదార్థస్వరూపమును సుస్పష్టముగా నిరూపింపచేసేది. అదే ఈ

sri sathyasai vachanamrutam

జగత్స్వరూపము.

> **ఉన్నదిదియని చెప్పంగగలరుగాని**
> **లేనిదిదియని చెప్పంగలేరు సుమ్మి**
> **ఉన్నదొక్కటె దైవంబు ఎన్నటికిని**
> **లేనిదయ్యెను విశ్వంబు కానరయ్య.**

ఉన్నది ఒక్కటే! 'ఏకంసత్ విప్రాః బహుధావదంతి'. అదియే being ఉన్నది. ఉన్నదని నీవు ఎట్లా చెప్పగలుగుతున్నావు? నీయందు ఆ ప్రేమతత్త్వమనే జ్ఞానము ప్రకాశిస్తున్నది. కనుక, ప్రతి మానవునియందు ప్రకాశింపచేసేది, వికసింపచేసేది, ప్రకటింపచేసేది, ప్రేమతత్త్వమొక్కటే. ఈ ప్రేమ తత్త్వమునే దైవముగా మనము విశ్వసించాలి. ఈ ప్రేమలేక జీవితమేలేదు.

**సర్వత్ర వ్యాపించిన బృహత్తత్త్వము ప్రేమయే!**

> **ప్రేమమయుండు శ్రీధరుండు ప్రేమయె అతని దివ్యరూపమౌ**
> **ప్రేమయె సర్వమానవుల ప్రీతికి తారకమంత్రమట్టి స**
> **త్ప్రేమ రవంతయైన వివరింపగలేక జగంబునందు త**
> **త్కామిత సత్పదార్థమెటు గాంచగనేర్తురటయ్య మానవా!**

సర్వత్ర వ్యాపించిన బృహత్తత్త్వము ప్రేమయే! ఇదియే బృహత్స్వరూపము. దీనికే 'బ్రహ్మ' అని పేరు. ఇదియే మానవుడు గుర్తించి, వర్తించుటకు తగిన అవకాశము. ప్రేమ ఉన్నది. ఈ ప్రేమను ఎప్పుడు ఎట్లా ఉపయోగించాలి? దీనినే సత్యాన్వేషణ అన్నారు. సత్యము సర్వత్రా ఉంటున్నది. దీనిని అన్వేషించటమేమిటి? అనగా చూచేది కన్నులు. అయితే ఏ ఏ వ్యక్తిని ఏ విధమైన దృష్టితో చూడాలి? తల్లి ఉంది, బిడ్డ ఉంది, భార్య ఉన్నది, సోదరి ఉన్నది. తల్లిని తల్లి దృష్టితో చూడాలి. బిడ్డను బిడ్డ దృష్టితో చూడాలి. భార్యను భార్య దృష్టితో చూడాలి. సోదరిని సోదరి దృష్టితో చూడాలి. మనకున్న కన్ను ఒక్కటే! ఈ కన్నుతో ఎవరిని ఏ దృష్టితో చూడాలి అనే విచారణే సత్యాన్వేషణ. కానీ, ఈనాటి మానవులు దృష్టితత్త్వాన్ని చక్కగా గుర్తించుకొనలేక కన్నులున్నవికదా ఎవరిని చూస్తే ఏమిటి అని భావిస్తున్నారు. అక్కడనే

sri sathyasai vachanamrutam

పాపం ప్రారంభమవుతున్నాది. నీ దృష్టికి ఒక విలువ ఉంటున్నాది. శ్రవణమునకుకూడా ఒక విలువ ఉంటున్నాది. వినేది చెవులే! కానీ ఎలాంటి విషయములు వినాలి? ఎట్టి వినికిడిలో చెవులను ప్రవేశపెట్టాలి? ఈ సత్యాన్ని గుర్తించాలి. ప్రతి యింద్రియమును, దానికి తగినట్టుగా సమయ సందర్భానుసారముగా ఎప్పుడు, ఎక్కడ, ఎట్లా, ఎవరిని, ఏ విధంగా చూడాలి? అది ఉపయోగించుకోటమే నిజమైన మానవతా విలువ.

## ప్రేమయే మానవునికి నిజమైన విలువనందిస్తున్నాది

ఆ ప్రేమయే మానవునికి నిజమైన విలువనందిస్తున్నాది. మనము ఒక భవనము కట్టుకున్నాము. ఈ భవనమునకు కొన్ని కిటికీలు పెట్టుకున్నాము. కొన్ని ద్వారములుకూడా పెట్టుకున్నాము. ఈ కిటికీలు దేనికోసం? మంచిగాలి రావటానికి, చెడ్డగాలి పోవటానికి; వెలుగు రావటానికి, చీకటి పోవటానికి. ద్వారములు ఎందుకు? మనము లోపలకు, బయటకు రావటానికి; మన మిత్రులు, బంధువులు, అవసరమైనవారిని లోపలకు రానివ్వటానికి ద్వారములుంచుకున్నాం. మనకవసరమైనవారిని లోపలకు ప్రవేశపెడతాముకానీ మనకు విరుద్ధమైన వారిని లోపలకు ప్రవేశపెట్టము. అదే విధముగా 'దేహోదేవాలయప్రోక్తో జీవోదేవస్సనాతనః' దేహము ఒక దేవాలయము. గృహము ఒక మందిరము. ఈ house కు నవద్వారములుంటున్నాయి. అయితే మన కంటికి కనుపించేవి ఐదు ద్వారములు. ఇవి చాలా ప్రధానమైనవి. సింహద్వారమునుండి మనకు మిత్రులు, బంధువులు, ప్రియులు వీరిని ప్రవేశపెడతాము, 'రండి దయచేయండి' అని. అట్లుకాకుండా ద్వారము ఉన్నదికదాయని, బజార్లోపోయే పందులను, కుక్కలను మనం యింట్లో వదలివెడతామా? వదలము. అదే విధముగా మనదేహమనే దేవాలయమందు, గృహమందు ఏదిమంచిది, ఏది పవిత్రమైనది, ఏది జీవితమునకు ఆదర్శమునందించేది, అనే విచారణ సల్పి విచక్షణా జ్ఞానముచేత ఏఏ భావాన్ని, ఏ విషయాన్ని లోపల ప్రవేశపెట్టాలో దానిని మాత్రమే ప్రవేశపెట్టాలి. అన్నింటిని మనం ప్రవేశపెట్టకూడదు. ప్రేమ ఉన్నదని అన్నింటికి దాన్ని ఉపయోగపెట్టకూడదు. ఎక్కడెక్కడ ఎంత ప్రవేశపెట్టాలో అంత పరిమితిలోనే ఉపయోగపెట్టుకోవాలి.

sri sathyasai vachanamrutam

**సమాజగౌరవమును మనం కాపాడినప్పుడే సమాజముకూడా మన గౌరవమును కాపాడుతుంది**

మనము సమాజములో పుట్టాము. సమాజములో పెరుగుతున్నాము. సమాజములో జీవిస్తున్నాము. సమాజ గౌరవమర్యాదలను మనం చూడవలసివస్తుంది. సమాజ గౌరవము మనం కాపాడినప్పుడే మన గౌరవంకూడా సమాజము కాపాడుతుంది. దీనినే 'ధర్మోరక్షతి రక్షితః' అన్నారు. పిల్లలు మీరు వేరుగా భావించకూడదు. ఈనాడు ప్రకృతియందు జరుగుతున్న సహజమైన రీతులు ఏ రీతిగా ఉంటున్నాయి? 20 సం॥ల సోదరుడు పెద్దవాడు, 16 సం॥ల ఆడపిల్ల, యిద్దరు అన్నా చెల్లెలు. వారికి తెలుసు, మనకు తెలుసు. కానీ, ఆ యిద్దరే ప్రయాణమవుతున్నప్పుడు జగత్తు ఏమని భావిస్తుంది? వారెవరో భార్య, భర్తలని తప్పుగా నిర్ణయిస్తుంది. అనగా సమాజమునకు విరుద్ధముగా మనము ప్రవర్తిస్తున్నాము. చెల్లెలు అన్న విడివిడిగా అయినా పోవాలి, లేక మీతో తల్లియో, తండ్రో ఒకరుండాలి. ఈ యువకులు, అన్నా చెల్లె అయినా యిద్దరు ఒంటరిగా పోకూడదు. సమాజము మనలను శిక్షిస్తుంది. మన గౌరవ మర్యాదలు మంటగలుపుతుంది. సమాజమునకు మన సంబంధబాంధవ్యములు ఏమాత్రం అర్థంకావు. ప్రాచీన కాలమునుండి మన సంబంధబాంధవ్యములను ఈ విధమైన పరిమితములోపల ప్రవేశపెడుతూ వచ్చింది, సమాజము. దీనినే 'సంస్కృతి' అని చెబుతూ వచ్చారు. సంస్కరింపచేసేది కాబట్టి సంస్కృతి. ఎప్పుడు, ఎక్కడ ఏవిధంగా మనం ప్రయాణం చేయాలి, ఏవిధంగా జీవించాలి, ఏవిధంగా ప్రవర్తించాలి, ఏవిధంగా మాట్లాడాలి అనే విషయము సంస్కరింపచేస్తుంది. సమాజ నిబంధనలు మనం చక్కగా పాటించుకుంటూ రావాలి. నిజంగానే సోదరి అయినా ఇంట్లో ఏవిధంగానైనా మాట్లాడుకోవచ్చు కానీ బయట ప్రపంచములో నీవు అన్న, తాను చెల్లెలు అయినప్పటికిని చాలా జాగ్రత్తగా మెలగాలి. ఈ ప్రవర్తనే మానవుని value పెంచుతూవస్తుంది. మానవతావిలువలు, నిత్య జీవితములో సత్యమైన మార్గమును నిరూపింపచేసే విలువలు, ఈనాడు మనం విస్మరించాం. అదే యింకొక మార్గములో మనం ప్రవేశపెట్టి చూచినప్పుడు 60 సం॥ల వృద్ధుడు, ఆయనకు ఎవరు ఇంటిలో సహాయము లేకపోవటంచేత 18 సం॥ల ఆడబిడ్డను పెండ్లి చేసుకోవాలని

ప్రయత్నించాడు. వారిద్దరు బజారులో ప్రయాణమై పోతున్నారు. ప్రపంచము ఏమని భావిస్తుంది? సమాజముయొక్క సత్యమును మనం చక్కగా గుర్తించుకోలేకపోతున్నాము. అతనిని grand father అని ఆమెను grand daughter అని అనుకుంటారు. నిజంగా చూస్తే grand father కాదు grand daughter కాదు. ఇక్కడ ఈ విధంగా విరుద్ధంగా జరుగుతుంది. అక్కడో అన్నాచెల్లెలు ఆ విధంగా విరుద్ధంగా జరుగుతుంది.

**మానవతావిలువలను మనం సక్రమంగా కాపాడాలి**

ఈ వయఃప్రమాణము, సమాజప్రమాణము, కర్మప్రమాణము, అనుభూతిప్రమాణము ఈ నాల్గు ప్రమాణములలో మన జీవితమును కొంతవరకు ప్రవేశపెట్టాలి. సమాజముయొక్క సత్యమును గుర్తించి, వర్తించేది సామాజికప్రమాణము. ఇది సామాజిక విలువ. దీనిని మనం ఉపయోగపెట్టి సరైన మార్గములో ప్రవేశపెట్టినప్పుడే మన కీర్తి నిలబెట్టుకోగలము, సమాజముకూడా మనలను గౌరవిస్తుంది. 'సమాజముతో నాకేమీ పనిలేదు, నా యిష్టము వచ్చినట్లు ప్రవర్తిస్తాన'ంటే రేపటిదినము సమాజము నిన్ను బయట పెడుతుంది. సమాజమువరకు నీవు పోనక్కరలేదు. నీవు ఏదైనా ఒక ఫలము భుజిస్తున్నావు. అది తీయగా ఉంటే నవ్వుముఖముతో మింగుతావు, ఆరగిస్తావు. అదే కొంత పుల్లగా ఉంటే తీసి పక్కన పారవేస్తావు. ఎందుకు నీవు పారవేశావు? నీ రుచికి తగినట్టుగా అదిలేదు. నీవు భావించిన రీతిగా అదిలేదు. కనుక, ఆ ఫలము నీవు పారవేస్తున్నావు. అట్లనే సమాజమునకు తగినట్టుగా ఉంటుంటే వారుకూడా నిన్ను గౌరవిస్తారు. సమాజమునకు విరుద్ధంగా ప్రవర్తించినప్పుడు వారుకూడా నిన్ను బయట పెట్టేస్తారు. నిన్ను ఏమాత్రము గౌరవించరు. నీ గౌరవప్రతిష్టలు సమాజములో కాకపోతే యింకెక్కడ సాధించుకోగలవు? మానవత్వమునకు గౌరవమే చాలా ప్రధానమైనది. కనుక మానవత్వములోని విలువలను మనం సక్రమంగా కాపాడుకుంటూపోవాలి.

**ప్రేమయే దైవము; దైవమే ప్రేమ**

ప్రేమే దైవము. దైవమే ప్రేమ. ప్రేమకే మనము విలువ యివ్వనప్పుడు దైవమునకుకూడా విలువ యివ్వనివారమవుతాము. ప్రేమకు పూర్తి విలువ యిచ్చినప్పుడే దైవమునకు విలువ

srisathyasaivachanamrutam

యిచ్చిన వారమవుతాము. ఇంక పరిస్థితుల ప్రభావము మీరు గుర్తించాలి. రామునిది మానవాకారము. సుగ్రీవుడు వానరాకారము. వీరిద్దరికి సన్నిహిత సంబంధబాంధవ్యమే రీతిగా కుదిరింది? ఈ స్నేహము ఏ రీతితో వచ్చింది? దీనిని ఆధారము చేసుకొని వచ్చింది. మానవులకు మానవులు స్నేహితులు కావచ్చు. వానరులకు వానరులు స్నేహము కావచ్చు. కానీ వానరులకు, మానవులకు స్నేహము ఏ రీతిగా లభించింది? రాముడు నరుడు, సుగ్రీవుడు వానరుడు. ఈ వానరునకు, నరునకు ఉండిన సంబంధము ఏమిటి? అక్కడ పరిస్థితులయొక్క ప్రభావము. రాముడు రాజ్యము వదిలాడు. పత్నీ వియోగముతో బాధపడుతూ తిరుగుతున్నాడు. సుగ్రీవుడుకూడా రాజ్యభ్రష్టుడయ్యాడు. అతనుకూడా పత్నీ వియోగముతో పరితపిస్తున్నాడు. ఈ పరిస్థితిలో వారిద్దరికిమధ్య సఖ్యము కుదిరింది. నా బాధ ఎట్టిదో అతని బాధ అట్టిదే అనే సమత్వము గుర్తిస్తూ వచ్చింది. ఈ భార్యా వియోగము నన్ను ఎంత బాధిస్తున్నాదో అతనికికూడా భార్యా వియోగము అంత బాధిస్తున్నాది. ఈ అవస్థ మైత్రితో పుడుతూ వచ్చింది. చిన్న చిన్న విషయములు మనము సమాజములో నేర్చుకోవలసినవి ఎన్నో ఉన్నాయి. ఈనాడు గ్రంథములలో నేర్చుకొనేవికాదు ప్రధానము. అనుభూతితో మనం నేర్చుకోవాలి. practical science గానీ platform speeches కాదు. Practicalలో మానవత్వమును పెంపొందించుకుంటూ రావాలి. ధనమున్నదని తల బిరుసుగా తిరుగుతుంటారు. విద్యావంతుడనని అహంకార పడుతుంటారు. అధికారినని విఱ్ఱవీగుతారు. ఇవన్నీ ఎంతకాలము? ఇవన్నీ శాశ్వతమైనవికాదు. అవన్నీ క్షణములో కదలిపోతుంటాయి.

## మబ్బు లేకపోతే వెలుగునకు విలువ లేదు

విద్యార్థులారా! మానవజీవితములో ఈ వయస్సునందు అతి జాగ్రత్తగా ప్రవర్తించాలి. మరొక విషయం చెబుతున్నాను. 'మాకురు జనధనయవ్వనగర్వం హరతినిమేషాత్కాలస్సర్వం'. ఎంత సేపు ఈ గర్వం? ఎక్కడనుండి వచ్చింది, ఎక్కడకు పోతుంది? ఇది శాశ్వతమా? తాతల ముత్తాతల ప్రాపరిటియా? కాదు కాదు. మనకై మనము పెంచుకున్నవే ఈ గర్వములు. ఈ గర్వము మనకు పనికిరానిది. నీవు విద్యావంతుడు అని అనుకోవచ్చు.

sri sathyasai vahini

**విద్యఉన్నదని విఱ్ఱవీగినగానీ**
**పుడమియందిసుమంత శాంతిలేదు**
**ధనమున్నదని బిగువుగా తిరుగుట**
**పుడమియందిసుమంత శాంతిలేదు**

ఏమిటి ఈ ధనము, బలము? యివంతా కదలిపోయే మేఘములు. మనము మేఘములు చూస్తుంటే దాని రూపము మారిపోతూ వస్తుంది. మన జీవితముకూడా అంతే!

**మబ్బులేలేని జీవితమార్గమందు**
**వెలుగునకు ఎన్నడైన విలువగలదె**

నిజంగా మబ్బు లేకపోతే వెలుగునకు ఏమాత్రము విలువలేదు. మబ్బులు ఉండటంచేతనే వెలుగునకు విలువ. అదే విధముగా మానవత్వములో అనేక ఒడిదుడుకులు వెంటాడుతూ ఉంటాయి. మానవడు క్షణక్షణము జీవిత ఉన్నతస్థితికి అనేక ప్రయత్నములు సల్పుతుంటాడు. నిర్విరామ కృషిచే నిరంతరం తాపత్రయములచే, అంతులేని ఆశలచే, అర్థముగాని ఆవేదనచే అప్రాప్తరూపప్రాప్తికై ప్రాకులాడే మానవత్వము అనిత్యమైంది. ఇవన్నీ అప్రాప్తరూపమైన ప్రాప్తులే! ప్రాప్తరూపమైన ప్రాప్తులుకాదు. దీనికి చక్కని రాజమార్గము చూపేది, వెలుగుబాటను చూపేది, ఆధ్యాత్మిక దీపికలే! ఆ దీపములు మనం వెలిగించుకోవాలి. ఆ పవిత్రమైన విశ్వాసము మనం పెంచుకోవాలి. ఎన్ని ఉండినా ఏనాటికి ఇవి మనవెంట వచ్చేవికాదు. వెంటవచ్చేది In you, with you, above you, below you, around you. you are GOD. అది ఒక్కటే దైవత్వము.

**నిజమైన మిత్రుడు దైవము ఒక్కడే!**

తెప్పలుగ చెరువునిండిన కప్పలు పదివేలు చేరు. ఎక్కడ చూచినా బెకబెక లాడుతుంటాయి కప్పలు. ఆ నీరు ఎండిపోతే ఒక్క కప్ప అక్కడుండదు. ఈనాటి మీ స్నేహాలుకూడా ఇట్టివే! జేబీలో నూరురూపాయల నోటు ఉంది. తండ్రి మంచి position లో ఉన్నాడు. అందరు నిన్ను 'హలో', హలో', అని వస్తుంటారు. కానీ నూరు రూపాయల నోటు ఖర్చయిపోయింది. తండ్రి రిటైర్ అయిపోయినాడు. నిన్ను 'హలో' అనేవాడు ఉండడు. ఈనాటి మిత్రత్వము యిలా

sri sathyasaivachanamrutam

ఉంటున్నాది. ఇదికాదు మిత్రత్వము. నిజమైన మిత్రుడు దైవము ఒక్కడే! అతనే ఎన్నటికి వదలని మిత్రుడు

**అడవిలోననున్న ఆకాశమున నున్న**
**పట్టణమున నున్న పల్లెనున్న**
**గుట్టమీద నున్న నట్టేటనున్నను**
**మదిని సాయి నిన్ను మరువడెపుడు.**

అట్టి నిజమైన మిత్రుని ఈనాడు విస్మరిస్తున్నారు. అప్పటికప్పుడు కదలిపోయే మేఘములవంటి మిత్రులను అంటగట్టుకుంటున్నారు. ఇవన్నీ మనకే ప్రమాదము. కానీ, ఆ సమయమునందు మనము అర్థము చేసుకోలేము. క్రమక్రమేణా ఈనాటి మిత్రుడే రేపు శత్రువు. ఈనాటి శత్రువే రేపు మిత్రుడు. కానీ భగవంతుడట్లా కాదు. మిత్రత్వము దైవమునకు heart to heart, love to love. వ్యక్తులమధ్య మిత్రత్వము body to body, money to money అంతే! అది ఎంత కాలముంటుంది? ఇవన్నీ కదలిపోయే మేఘములు. దీనిని మనం శాశ్వతమని విశ్వసించరాదు. భగవంతుడొక్కడే శాశ్వతమైన తత్త్వము.

**నీవే దైవము**

మీరు నమ్మినా నమ్మకపోయినా దైవత్వము సర్వత్ర నిండి ఉంటున్నాది. నీవే దైవము. నీకంటే మించిన దైవము మరొకటిలేదు. కాబట్టి వేదమును విశ్వసిస్తూ రావాలి. వేదము తెలియకపోయినా పెద్దలు చెబితే విని దానిని విశ్వసించాలి. బజార్లో పోతే సాముద్రిక శాస్త్రజ్ఞుడు ఉంటాడక్కడ. ప్రతి ఒక్కడు 5 రూపాయలిచ్చి చేతులు చూపించుకుంటాడు. వాడు చెప్పిన మాటలు నమ్ముతారు. బజార్లో చెప్పేవాని మాటలు నమ్ముతున్నారు. సాక్షాత్ దైవస్వరూపమైన వేదము 'ప్రజ్ఞానం బ్రహ్మ'. నాయనా! నీవే బ్రహ్మ. 'తత్త్వమసి' అదీ నీవై ఉంటున్నావు. 'అహంబ్రహ్మాస్మి' అని అంతర్వాణి ప్రబోధిస్తున్నాది. ఇలాంటి నిత్యసత్యమైన పదములు విశ్వసించుటకు ఏమాత్రము పూనుకొనటంలేదు. దమ్మిడీకి పనికిరానివాడు చెప్పినదివిని మనం అనుసరిస్తున్నాము. కారణం ఏమిటి? దానిపై మనకు విశ్వాసము. గంతకు తగిన బొంత అని, అనిత్యమైనవారు అనిత్యమైనవే యిష్టపడుతుంటారు.



sri sathyasai vachanamrutam

నిత్యసత్యమైనది నిత్య సత్యమునే విశ్వసిస్తుంది. నీవు నిత్యసత్యమైనవాడవు. దేహము కేవలం నీటిబుడగ. ఏ క్షణములో పోతుందో! కానీ, నీవు నిత్యమే! నీవు సత్యమే! నీవు ఆత్మ స్వరూపుడవు. 'ఆత్మ' అంటే ఏమిటి? మన ప్రేమతత్త్వమే ఆత్మ. ప్రతిఫలాపేక్షలేకుండా చూపించిన ప్రేమయే ఆత్మతత్త్వము. అదియే selfless. ఎక్కడ selfish ఉంటుందో అది fish. Fish is better than selfish. ఆ fish మేలు. నీటిలో తిరుగుతూ నీటిలోని మాలిన్యము భుజిస్తుంది. నీటిని శుభ్రము చేస్తుంది. ఈ selfish man society లో చేరి society ని మాలిన్యము చేస్తున్నాడు. కనుక selfishness ను పరిమితములో పెట్టుకోవాలి. Selfishness లేకుండా ఉండుటకు వీలుకాదు. అయితే అందరి సంబంధము మనకు ప్రధానమైనదికాదు. ఇదంతా తాత్కాలికమైన సంబంధము. మీరు జాగ్రత్తగా ఎవరితో అధికంగా సంబంధము పెంచుకోకుండా అందరితో ద్వేషములేకుండా పరిమితమైన ప్రీతితో పరతత్త్వమును పరతత్త్వమునకే అర్పితము చేయాలి. ఈనాటి ప్రపంచమందు మంచిచెడ్డలన్నీ సంబంధబాంధవ్యములతో ఏర్పడుతున్నాయి. మనము ఎట్టి సంబంధముచే ఉంటామో అట్టి గుణములు మనలో ప్రవేశిస్తున్నాయి. అందుకోసమే Tell me your company, I shall tell you what you are అన్నారు. నీవు ఎలాంటివారితో చేరుతున్నావో అలాంటి బుద్ధి నీలో వచ్చి ప్రవేశిస్తుంది. దానికోసమే నేను ఎంతో గట్టిగా చెప్తుంటాను. ఎంతవరకో అంతవరకు పరిమితముగా పెట్టుకోవాలి. ప్రేమకు, క్రోధమునకు, అసూయకు, ఆశకుకూడా పరిమితముండాలి. ఆశలు మితిమీరితే దురాశ అవుతుంది. దురాశ దుఃఖమునకు మూలకారణమవుతుంది. ఆశ ఉండవలసిందే, ప్రతి మానవునకు ఎంతనో అంత. వంటకు తగిన మంట. పాత్రకు తగిన పదార్థము. శేరు బియ్యం ఉడికే పాత్రలో 5 శేర్లు బియ్యం పోస్తే అది ఉడుకుతుందా? మన ప్రేమను ఎవరికి ఎంతెంత పంచాలో అంతవరకే! ఆ విలువ మనం గుర్తించాలి. ఉన్నది ఒక్కటే ప్రేమ. ఛటర్జీ చెప్పాడు 'స్వామీ! నేను ఊరికి పోతున్నాను', అన్నాడు. 'మంచిది' అన్నాను. స్వామీ! 'నేను నిన్న వచ్చాను' అన్నాడు. 'మంచిది' అన్నాను. ఇంత మాత్రమే కాదు. యింకా కొన్ని తెలీదు అతనికి. 'స్వామీ! నేను చచ్చిపోతున్నాను' అని ఎవరైనా అంటే 'మంచిది' అంటాను. 'స్వామీ! నేను ఈ బాధను భరించుకోలేను' అంటాడు. 'మంచిది' అంటాను. ఏది మంచిదికాదు, ఈ జగత్తులో? అన్నీ

sri sathyasai vahini amrutam

మంచివే! The pleasure is an interval between two pains. రెండు బాధల మధ్యనే ఒక సుఖముంటున్నాది. కనుక, ప్రతి దానికి నేను మంచిది అంటాను. కారణం ఏమిటి? అంతా నాలో మంచే ఉంటున్నాది. 10 చిల్లులగల పాత్రలో పాయసం పోస్తే ఏ చిల్లులో వచ్చినా పాయసమే వస్తుందిగానీ ఒక దానిలో విషం వస్తుందా?

**హృదయములో ప్రేమ నింపుకుని ఏ పని చేసినా అది ప్రేమమయంగా ఉంటుంది**

నానిందుకు నేను ప్రేమనే నింపుకున్నాను. ఆ ప్రేమ వినికిడిలో మాధుర్యమే, పలుకులో మాధుర్యమే, వానసలో మాధుర్యమే, చేతలో మాధుర్యమే, మనస్సులో మాధుర్యమే, బుద్ధిలో మాధుర్యమే, హృదయములో మాధుర్యమే! అంతా మాధుర్యమే! హృదయములో మీరు ప్రేమ నింపుకోండి. అప్పుడు ఏ పని చేసినా అది ప్రేమమయంగా ఉంటుంది. అదీ నిజమైన హృదయం. 'హృదయం', ఎందుకు యీ పేరు వచ్చింది? కరుణతో నింపినదే హృదయం. కఠినమైన హృదయము హృదయమేకాదు. అది పాషాణం. విషము. అది హృదయమని చెప్పటానికి వీలుకాదు. ప్రేమతో నిండిన హృదయము. ఆ హృదయముయొక్క సంగతి మానవునకు మాత్రమే తెలుసు. పశుపక్షిమృగాదులకేమాత్రము తెలియదు. అవి సహజమైన నిత్యజీవితము గడపుతూ వస్తున్నాయి. మానవుడు తన సహజమునకు కొన్ని మార్పులు కలిగించి బ్రతుకుతున్నాడు. పండిన పంటలోని వడ్లను తీసుకొని భుజిస్తుంటాయి, పక్షులు. పంటలో ప్రవేశించి గడ్డిని భుజిస్తుంటాయి. కానీ మానవుడు అట్లుకాదు. గడ్డిలో పుట్టిన వడ్లను వేరు చేస్తాడు. వడ్లలోని పొట్టు వేరు చేస్తాడు. బియ్యము తీసి పక్వము చేస్తాడు. పక్వము చేసిన తరువాత కూరలు కలిపి భుజిస్తాడు. పుట్టినది పుట్టినట్లుగా భుజించటంలేదే, వాడు. సంస్కరింపచేసి ఆనందము ననుభవిస్తున్నాడు. మానవుడు ఒక్కడు మాత్రమే సంస్కరింపచేసి అనుభవించేది. ఒక కోతి చూడండి. మానవునికంటె ముందు జాతి. అరటిపండు విసరండి. అట్లే కొరుక్కొని తినదు. తొక్కతీసి తింటుంది. దానికి ఎంత జ్ఞానముంది! దానినుంచే వచ్చింది, వీళ్లు. వానర అంటే వాలముంది. వాలములేని వాడు నర. ఇంతే భేదము. వాని చేష్టలు అన్నీ దానికి ఉన్నాయి. దాని చేష్టలన్నీ వీరికి ఉన్నాయి. వీని desires వాటికీ ఉన్నాయి. వాటి desires వీనికీ ఉన్నాయి. Mankind అన్నారు. Man ఎట్లా

sri sathyasai vachanamrutam

ఉండాలంటే kind గా ఉండాలి. దానివల్లనే mankind అన్నారు. ఒక్కొక్క పదమునందుండిన అర్థమును సరియైన రీతిగా తీసుకొని మనము సక్రమమైన మార్గములో వినియోగించుటకు పూనుకోవాలి.

**యావత్ప్రపంచమును ఏకముగావించేది ప్రేమ ఒక్కటే!**

విద్యార్థులారా! మీలో కావలసినన్ని విలువైన వస్తువులుంటున్నాయి. ఆ విలువైనవి లోపలుంటున్నాయి.

**విలువలేని యినుపపెట్టె ఈ దేహంబు**
**పెట్టెలోన నగలు పెట్టినట్లు**
**ఆత్మతత్త్వముండె దేహమందు....**

ఈ iron safe లో విలువైనవి పెడతారుగానీ పైన పెడతారా? ఆ పెట్టెలోపల ఉంటున్నాయి విలువైనవన్నీ. దయ, ప్రేమ, సహనము, సానుభూతి అన్నీ విలువైనవి ఉంటున్నాయి. ఇవన్నీ వజ్ర వైఢూర్య, మరకత, మాణిక్య, గోమేధిక, పుష్యరాగ, ముత్యము, పగడము యిలాంటివన్నీ ఉంటున్నాయి. ఇంత విలువైనవి లోపల పెట్టుకొని కేవలం బయటపడిన ముత్యపు చిప్పవలె మనం వెతుకుతున్నాము. సముద్రము ఎంతటి lesson నేర్పుతున్నాది, చూడండి! విలువైన ముత్యములను తనలోపల పెట్టుకుంటుంది. నత్తగుల్లలను బయటకు నెట్టి వేస్తుంది. బయట చిక్కేది చిప్పలే! ముత్యములు చిక్కవు. లోపల మునిగి వాటిని తీయాలి. ఆ విధముగా శ్రమపడినప్పుడే ముత్యములు మనకు చిక్కుతాయి. అదే చెప్పింది మీరా: 'ఓ కృష్ణా! లోతైన సముద్రములో ఎంతో శ్రమపడి నేను ఒక ముత్యము సంపాయించుకున్నాను. ఆ ముత్యమే కృష్ణా! కృష్ణా! అనే నామము. ఆ ముత్యము చేయిజారి తిరిగి పడిపోయేటట్లుగా మాత్రం చేయకు. నీకంటే నాకు వేరే గతిలేదు'. ఈ విధమైన ఆవేదన, పరితాపము భక్తుని హృదయములో ఆరంభము కావాలి. అప్పుడే ఆ మానవుడు సంపూర్ణ మానవుడుగా జీవించుటకు వీలవుతుంది. లేకపోతే ఆకారమానవుడేగానీ ఆచారమానవుడుకాదు.

**బూరగకాయలు చూచి మామిడియని భ్రమసినట్లు**

srisathyasaivachanamrutam

**వెఱ్ఱిచెరకు రూపుచూచి చెఱకని తా నమిలినట్లు**
**కలికిరాయి రూపుజూచి కలకండని నమిలినట్లు**
**రూపుజూచి మోసపోకు గుణమే నీ నిజరూపము.**

గుణమే నీ రూపము. కేవలం చేతులు, కాళ్లు, ముక్కు, నోరు ఇవన్నీ ఉన్నంత మాత్రమున నీవు మనిషికాదు. గుణమే నిజరూపము. ఆ గుణమే ప్రేమస్వరూపము. దానిలో ఎలాంటి దోషములు ఉండవు. యావత్ప్రపంచమును ఏకముగావించేది ప్రేమ ఒక్కటే! ప్రేమ ఎక్కడ నీవు ప్రవేశపెడతావో అక్కడ ఏకాత్మభావము ఉంటున్నది. అక్కడ ఆనందము ఉట్టి పడుతుంది. ఈ ప్రేమానందములు రెండూ చేరితే శాంతి మన స్వరూపమే అయిపోతుంది.

**దైవము ప్రేమ స్వరూపుడు**

ఈనాడు శాంతిలేదు, శాంతిలేదు అంటే ఎక్కడనుండి వస్తుంది? నీలో ప్రేమఉందా? లేదే? ఈ ప్రేమ లేనప్పుడు శాంతి ఎట్లా లభ్యమవుతుంది? కనుక దేనినో చూచి మోసపోకూడదు. మానవత్వపువిలువ చూచి మనం బలవాలి

విద్యార్థులారా!

**పుట్టపైన మర్దించిన పాము మరణమొందునా?**

పైపై షోకులు మనం చేసినంత మాత్రమున తృప్తికాదు, భగవంతునకు.

**తనువును తా దండించిన విషయభోగములుడుగునా?**
**ఆకలిదప్పులు మానినంత ఆత్మజ్ఞానియగునా?**
**తానెవరో తెలియకున్న తత్త్వజ్ఞానమెటులబ్బు?**

తానెవరో తెలుసుకోవాలి. అప్పుడే దీనికి సరైన విలువ. దైవము ప్రేమస్వరూపుడు. Love is GOD. Live in LOVE ఆ ప్రేమతత్త్వము ఎక్కువ అభివృద్ధి గావించుకోవాలి. అయితే 'ఎవరెవరిని ఎట్లా ప్రేమించాలి', అనే విషయము గ్రహించాలి. సంపూర్ణప్రేమ ఒక్క దైవమునకు తప్ప అన్యులకు మనము అర్పితము చేయరాదు. అట్లు చేసిన అది పెడమార్గము పడుతుంది. ఎంత పాత్రయో అంత నీరు మాత్రమే చేరుతుంది.

sri sathyasai vahanamrutam

**కర్మ దాట వశమా నరుడా కర్మ దాట వశమా**
**చిన్న చెలమలో ముంచిననైనా సప్తసాగరాల్ నింపిననైనా**
**కడవెంతో నీరంతేరా కావాలన్నా ఎక్కువ రాదుర ॥కర్మ॥**
**ధనికుడు తృటిలో బికారికాడా పండితుడింతలో పశువైపోడా**
**కళ్ళ పామై కరవను రాదా కర్మ హేతువు కర్మే మూలము ॥కర్మ॥**
**భుజబలమెంతో చూపినగాని మొనగాడనుచు మురిసిననైన**
**ముక్కుకు త్రాడై ముందుకులాగే ఆముగదాడే కర్మరా**
**ఘన పాఠంబులు చదివినగాని కులదేవతలను కొలచినగాని**
**కారడవులకే పోయినగాని కఠిన తపస్సులే చేసినగాని ॥కర్మ॥**

ఈ కర్మను ఎంతవరకో అంతవరకు పరిమితము చేసుకోవాలి. 'కర్మానుబంధీని మనుష్యలోకే'. మానవుడు కర్మచేత కట్టబడ్డాడు. అందుకోసమే పిల్లలకు చాలా strict గా చెప్తుతుంటాను. 'జాగ్రత్త, జాగ్రత్త' అని. ఆ జాగ్రత్తను అజాగ్రత్తగా పెట్టుకుంటే యింక మరి చిక్కదు. కనుక అతి జాగ్రత్తగా మీ జీవితమును విలువైన రీతిగా తీర్చిదిద్దుకొని సమాజములో గౌరవమర్యాదలు పెంచుకోండి! కన్న తల్లితండ్రులకు, బోధించిన గురువులకు, నివాసము యిచ్చిన కాలేజీకి సత్కీర్తి తేవాలి. మన Institute లో దేనికి నయాపైసా తీసుకోటంలేదు. లక్షలాది బిడ్డలకు చదువు చెప్పించి చక్కగా ఆనందంగా ఇండ్లకు పంపుతున్నాము. ట్యూషను ఫీజుకానీ, లాబరేటరీ ఫీజుగానీ, గేమ్సుఫీజుగానీ, లైబ్రరీఫీజుగానీ, పరీక్షఫీజుగానీ ఏదీలేదు. ఎక్కడుంది ఇటువంటి చదువు, ఈ ప్రపంచములో? ఎక్కడికి వెళ్ళినా వేలకు వేలు కట్టి చదువుకోవాలి. ఒక బిడ్డ పుట్టిందంటే అప్పుడే స్కూలు సీటుకి అప్లికేషను వేసుకోవాలి. రాబోయే 5 ఏండ్లకు యిప్పుడే ఇరవై వేలు కట్టాలి. ఇలాంటి చదువులు నిజమైన చదువులా? కాదు, కాదు. ప్రేమతో heart to heart, love to love అందించే ప్రదేశము ఈ ప్రశాంతినిలయము. ఇలాంటి దాన్ని అర్థము చేసుకోలేకపోతున్నారు, మూర్ఖులు. నిజంగా మీరు బయట ప్రదేశములో చదువుతే మీ తల్లిదండ్రులు ఎంత బాధకు గురయ్యేవారో, ఎంత ధనము వ్యయము చేయవలసివస్తుందో, ఎంత worry కి గురౌతారో? College లో strike అంటే తల్లిదండ్రులకు గుండెలు



srisathyasaivachanamrutam

కొట్టుకుంటాయి. మా పిల్ల వాడుంటాడు, ఏమవుతుందో ఏమో అని ఎంతో వారు భయపడుతుంటారు. మన Institute లో అలాంటి భయమునకు అవకాశములేదు. అదే ధైర్యము. ఆ ధైర్యము ఎక్కడనుంచి వస్తుంది? ఎక్కడ మంచో అక్కడే ధైర్యము వస్తుంది. కనుక ఆ goodness మీరు కాపాడుకోవాలి. ఆ goodness యే Godliness. కనుక దైవత్వమును ప్రేమించండి. దైవప్రేమకు మించిన ప్రేమ మరొకటిలేదు. ప్రేమ తత్త్వము చక్కగా పెంచుకోండి. దానిని సరైన మార్గములో ఉపయోగపెట్టుకోండి.

**(తేదీ 03-09-1996న కుల్వంత్ హాలులో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam